# ధర్మరాజులు

(కథానిక)

జంటగా వున్న మేఘశకలాలు ఆకాశంలో నెమ్మదిగా విడిపోతున్నాయి. ఆ రెంటి మధ్య నీలి తెరలు ముసుగువేసుకు నిలుచుంటున్నాయి! శూన్యం ఏర్పడుతోంది.

పొలంలోంచి నారయనాయుడు నాగలి కర్రెత్తుకొని ఇంటిముఖంగా బరువుగా వస్తున్నాడు. సంజచీకటి నెమ్మదిగా తెర వాల్చుతోంది. నాయుడు ఇంటి గుమ్మం ఎక్కేసరికి భార్య నాగులమ్మ గుడ్డిదీపంలో చమురు పోసి వెలిగిస్తోంది. నారయ నాగలికొణ్ణి పశువుల కొట్టంలో పారేసి నేలమీద తేలిపోతూ గోలుగా వాలిన మడతమంచం మీదికి తూలిపోయాడు. ఎక్కడా కళ్ళల్లో రక్తకణమైనా లేదు. పాలిపోయిన పెదవులు జారిపోయి వణికిపోతున్నాయి. సొగసిపడిపోయి, పిటపిట ఇల్లు కూలిపోయినట్టు మనసంతా కూలి కుమ్మైపోతున్నాడు.

"బాబూ" అంటూ నాలుగేళ్ళ చిన్న కొడుకు వచ్చి పలకరించినా కసిరేసి, విసిరేశాడు.

పెద్దకూతురు గంగమ్మ "వేణ్ణీళ్ళెట్టాను— రాయ్యా" అని కేక వేసింది.

అప్పటికీ కదల్లేక పొయ్యాడు పెద్ద బరువు నెత్తిన మోస్తున్నట్టుగా.

గట్లంట మేసివచ్చిన గేదెలూ, ఆవులూ అలా నిదుముక్కల్లా నిలుచుండిపోయాయి గాని నాలుగు గడ్డిపరకలు వేసే దిక్కు లేక పొయ్యింది— నారయనాయుడు తప్ప తక్కిన వాళ్ళెవరూ పశువుల జోలికి పోనేపోరు. అప్పటికీ నాయుడికి తెలివి రానేలేదు.

పెద్దకూతురొచ్చి, "బాబూ! అలాగున్నావేం?" అని అడిగినా కిక్కురు మనలేక పొయ్యాడు నాయుడు.

నాగులమ్మ కూడా చిన్నపిల్లకి చందమామం చూపుతూ ముద్ద నోట్లోపెడుతూ, "అలాగున్నారేం?" అని అడిగింది. దానికీ సమాధానం లేదు. ఊరికే భూతావేశుడికిమల్లే నడుస్తున్నాడు— తూలుతున్నాడు.

దొడ్లోకెళ్ళి, గేదెలకి మేతా, కోతా వేసి, స్నానంచేసి, సరిగా వళ్లు తుడుచుకోకుండానె గిన్నెముందు కూర్చున్నాడు ఊటలూరిన ఊరగాయముక్క కలుపుతూ.

మనిషి సముద్రంలాగ హోరుమంటున్నాడే గాని, అతని నోరు కట్టుబడిపోయింది.

గిన్నెత్తుకొని గంజితాగబోతూ చెయి పట్టు విడి, గిన్నెముందూ తను వెనకా పడిపోయాడు. నారయ నాయుడు వెర్రిగా నాగులమ్మవైపు చూశాడు.

"ఏం అలా చూస్తున్నారే?" భయంగా అడిగింది. నాయుడు మనసులోని సంగతే చెప్పకోలేని దురవస్థలో పడి పోర్లాడుతున్నాడు.

ఏం చెపుతాడు? తనంత తనకే మహాశ్చర్యంగా దుస్సంభవంగా వున్న విషయం ఇంకొకరి కెలా చెపుతాడు? తనకూ తన దగ్గరగా అంటుకుపోయిన నారాయణకీ ముడి విడిపోయిందని, ఇద్దరిమధ్య భయంకర నిశీథ అగాధం ఏర్పడిందని యెలా చెప్పగలడు? ఆ అగాధంలో ఎగపీల్పులు, దిగశ్వాసలు, హోరుమనే నిశ్శబ్దం, కత్తిపోడుపులు, హుంకరింపులు, రక్తోద్వేగాలు!

తానా అగాధంలో కుటుంబ సహితంగా దొర్లిపోయి నాశనమైపోవాలిసిందేనా? ఎంతలో అమృతం విషంగా మారిపోయింది? స్నేహాన్ని నమ్మడానికి వీలుందా? ఎవరు తనకు స్నేహితులు? ఎవరితో తన స్నేహం? నారయనాయుడు వూహించుకోలేక భయపడిపోతున్నాడు. నారాయణా, తనూ గోలీకాయల నాటినుండి స్నేహితులు కాకపోయినా, అంత దిట్టమైన గట్టి స్నేహం వాళ్ళమధ్య తాడు బిగించుకుంది. చెట్టుకూ పుట్టకూ అయిపోతున్న నారాయణ్ణి

"రమణశ్రీ"

తీసుకొచ్చి, తన కింద పెట్టుకొన్నాడు. అతన్ని ఒక యింటివాడికింద చేశాడు. పేరు పెట్టాడు. ఊళ్లో అందరికంటె యెక్కువగా పిలిచాడు. చేశాడు, చెండాడు. అయితే లాభం?

తమ యిద్దరిమధ్య తగువు బిగుసుకుందే? ఇదివరలో తమ అజమాయిషీ కింద ఎన్ని తగవులు తమాషాలు తీర్చలేదు? తమ పలుకుబడులు ఒకటిగా రూపించి కొలు నిలపలేదు? ఎంతమంది గడ్డి తింటూంటె బుద్ధి చెప్పారు! ఇప్పుడలాంటిది తమ యిద్దరిమధ్య రగులుకొంది. అందరిచేత ఆదర్శస్నేహితు లనిపించుకొన్నారు ఆనాటివాకొ—ఆ ఘడియవరకూ—నారాయణస్వభావం ఎటువంటిదైతేనేం. పట్టికరకు రకమే కావచ్చు. ఏనుగుగున్న మల్లే వుండి, వంకీలు తిరిగిన మీసాల్లో రోసాలు, పౌరుషాలు దాచుకొన్న ఘటికుడే కావచ్చు. ఆవూళ్ళో అతన్ని ఎదిర్చి చెయిగాని కర్రగాని, అఖరుకి తలగాని ఎత్తగలిగే ధీమంతులే లేకపోవచ్చు. ఎంత భయంకర వ్యక్తి ఐతేమాత్రం ఇంతవరకూ తనకండగా నిలిచాడు తనతో తిన్నాడు, తనతో చుట్ట వెలిగించాడు.

తన కుటుంబం, నారాయణ కుటుంబం, సాహచర్యంగా, సన్నిహితంగా మసిలేది. ఒకళ్లలో ఒకళ్ళకు అరమరికలుగాని భేదాభిప్రాయాలుగాని మచ్చరాలు మరకలుగాని లేకండా కలుపుగోలుతనం తెరలు కట్టుకొని "ఏవేవ్" అంటే, "ఏవేవ్" అనే స్థితిలో సారస్యం సల్లాపంగా, "ఒరేవ్" అంటే, "ఒరేవ్" అనే ఫక్కీలో - ఒడుదుడుకులు లేకుండా అంగారక గ్రహంలో జంట కొల్వాల మల్లే కలిసిమెలిసి ఇల్లూ, ఇల్లూరాసుకు నేట్టుండే వారు. కులం వేరయితేనేం? తను నాయుడు వంశానికి నిలుస్తే, నారాయణ పద్మనాయిక వెలమవంగడానికి నిలబడ్డాడు. అంత తేడాగానే, బండి సాగింది ఇంతవరకూ ఎత్తుపల్లాల మీద వత్తుగా.

స్నేహంలో ఇంత బలవంతంగా వేళ్లు నాటుకున్న నారయనాయుడు, నారాయణల మనసులు త్రవ్వకి దుంపలు పైకొచ్చేసినట్టు వేళ్ళతో సహా బయటపడిపోయినై. లోకంలో ఇట్టే నలుగురి నోళ్ళలో పడిపోతారు. ఎన్నెన్ని మాటలంటుందో గుట్టు తెలీని బట్టబయలి ప్రపంచం?

నారాయణ ఆవేళ వున్నట్టుండి, గట్టిగా అడిగేసేడు. "నువ్వు మక్తాకు చేస్తున్న పొలంలో నాకు వాటావుంది. ఇదివరకటి గొడవలతో సంబంధంలేదు. ఖచ్చితంగా పండినదాంట్లో సగం వాటా అక్కడ కక్కితేనేగాని వల్లగాదు. ఇదివరకంటే పంటలు పోయాయి. ఈ యేటి పంటలో సగంభాగం, పంపకంచేసి తెగతెంపులు చేసుకో" అని కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడాడు.

రెండు సంవత్సరాల క్రితం-నారయ, నారాయణ మరో యిద్దరు భాగస్వాములు కలిసి పొలం వ్యవసాయం చేశారు. ఆ యేడు తుపాను భీభత్సంలో జలప్రళయంలో పంటలు కొట్టుకుపోయి, ఆ యిద్దరు భాగీయులు తోకలు ముడిచేసి, మరో చోటికి కొట్టుకుపోయారు. నారాయణ అదృష్టంమీద కన్నేసి నారాయనాయుణ్ణి విడవకండా హృదయంమీది గట్టి పొరలాగ ముసలసాగాడు. అలా నెమ్మదిగా ఏకై వచ్చి మేకై కూర్చున్నాడు నాయుడి బట్టతలమీద. కదిలితే చాలు అర్థరూపాయి వాటా పాట పాడుతున్నాడు.

"ఇదిగో! నీ పిలక నా చేతిలోవుంది. లెక్కలన్నీ నాదగ్గరున్నై. నేను వాటాదారుణ్ణవునా కానా? లాభం, గీభం సగంచేసి అక్కడపెట్టు. అలా కానినాడు చూసుకో నా తడాఖా, నారాయణగాడి తడాఖా! పగపట్టిందా నాగుత్రాచు-కాటేసిందే పొద్దు వాటాలిపోవలసిందే! నువ్వూ నీ కుటుంబం నా మానాన పడి గోడు పెడుతారు - జాగ్రత్త! ఏదో మూసివాయనం ఇచ్చి, ముసుగు తన్నేద్దామనుకుంటున్నావ్ గాబోలేం? రచ్చకీడుస్తాను. మునసబు కరణాల్ని ముందుపెట్టి, నీ మచ్చ మాపుతా. నే వాటాదారుణ్ణవునా గానా? ఎంతమందిదగ్గర నువ్వు చెప్పుకోలేదు? మెలిదిప్పిననన్ని సాక్ష్యాలున్నై. ఇదిగో నువ్వు అమ్మింది రెండొందల బస్తా. నీవు సంపాదించిన సొమ్ము నాలుగువేలు- ధాన్యం దొంగతనంగా అమ్మి. న్యాయంగా నాకు రావల్సిన రెండువేలూ నా కాళ్ళముందు పోసి

మరి కదులు— మెదిలేవే? మేకై నీ తలెక్కుతాను."

* * *

ఈ విషయమే నారయనాయుడు పాలిట పిడుగై వర్షిస్తోంది— మేఘంలేని పిడుగు!

సముద్రం చెలియలికట్ట దాటిపోయినట్టు ఒక్కసారి కెవ్వున కేకవేశాడు నారయనాయుడు.

"నారాయణగాడికి వాటా కావాలట! సగం! ఇక్కడ మూటగట్టి దాచిపెట్టుకూచున్నావని."

నాగులమ్మ తుళ్ళిపడింది. ముసలి కాలు లాగినట్టు జారిపడింది.

"ఆఁ! ఏవిఁటీ? వాటా గావాలా?"

"అవును. ఒకటీ, రెండూ అనుకున్నావా? రెండువేల రూపాయిల మూట! పాతరలో ఉన్నాయనుకున్నాడు వాటాదారుడు గారు"

"అరి! వాడెలా వాటాదారయ్యేడనంటా? ఏం పెట్టుబళ్ళు పెట్టాడనీ? ఊరికే ఎగిరి పడొచ్చిన ఎంగిలాకుని చేరదీస్తే, వడ్డించమందట. ఎంత పొయ్యేకాలం. అయ్యో! అయ్యో! వాడి పెళ్ళాం పుస్తెలు తెగిపోను. వాడి జిహ్వ కుళ్ళిపోను. వాణ్ణి నే కాట్లో కాల్చెయ్యను" వాళ్ళ కుటుంబాలమధ్య నాటుకున్న స్నేహబంధాలు పటపట తెగిపోతున్నాయి ఒక్క లిప్తలో.

"వాణ్ణి చేరదీయొద్దని నే మొట్టమొదట చెపితే విన్నారేం. అనుభవించండి. ఇంకా నయం, మక్తాభూమైపోయింది గాని పొలం గూడా నాదే అనేవాడే. తుంటరుల్ని చేరదీస్తే ఇంతే."

నారయ భార్య నోరుమూశాడు. "ఇదెలా తేలుతుందో మేం జూసుకుంటాంగా నువ్వూరికే నోరు పారేసుకోకు."

నాగులమ్మ ఆగేమనిషి కాదు. మనిషిలో ఓర్పు తక్కువా ఊర్పు లెక్కువా.

"నే మొదటే మొత్తుకున్నా వీడితో పొత్తు కుదరదని. ఇలాగనే ఇంతవరకూ తీసుకొచ్చారు. మీ యిష్టం బాబు నాకెందుకు. ఇంట్లో పడుంటే ఆడముండని."

నాయుడు "ఇల్లంతా నిప్పుగుండం అయిందిరా భగవంతుడా" అని ముసుగు పెట్టుకున్నాడు.

నాగులమ్మ నోరు కట్టు తెగి పొరలి పారుతోంది "ఏమొగం పెట్టుకొని వాటా అడగొచ్చాడండి పెద్దమనిషి! నా పుస్తెలు, వస్తువులు తాకట్టుపెట్టి డబ్బుకు డబ్బు పారబోసి, మట్టిలోంచి ఏరుకుంటున్నావే? వాడు దమ్మిడీ పెట్టాడా పొలంలో? ఎలా తెగుతుంది? ఎలా తెగుతుంది?"

నారయనాయుడు తల పట్టుకొని లేచి కూర్చున్నాడు. గుడ్డిదీపం చిటికెలు లెక్కపెడుతోంది.

ఆ రాత్రల్లా నాయుడు అలా కనురెప్ప వాల్చనేలేదు గాలివాలుకి విరగబడిపోయిన చేనులాగ అలా పడివున్నాడు.

* * *

అక్కడ నారాయణ కత్తి సానపడుతున్నాడు. పళ్ళు నూరుతున్నాడు. కళ్ళతో ఉరుముతున్నాడు. కళ్ళెం బిగించిన రౌతుమల్లే కదం తొక్కుతున్నాడు.

"నేనూ గింజలు చల్లిస్త. ఒక్కనాడన్నా అటువైపు వచ్చాడుటయ్యా? చెరుకుతోట "అలో లక్ష్మణా" అని ఏడుస్తోంటే పంటకాల్వని చేలోకి మళ్ళించింది నేను గాదటరా? ఏసాలేత్తాడు ఏసాలు! అంతా పండించి, ఎండించి గింజలు తయారుపెడితే పట్టుకెళ్ళడాని కొత్తాడు మొనగాడు! నేను వాటాదారుణ్ణి కానేగానట! ఇంతకీ మూడుబత్తాలు మూసి వాయినం ఇత్తాట్ట! ఇత్తాడు."

నారాయణ మునసబు దగ్గరికెళ్ళి సంగతంతా వివరించాడు. ఊరంతా అతనికివాటా ఉన్నదనే అనుకుంటున్నట్టు మునసబు కూడా బాగా ఎరుక. వాళ్ళిద్దరినీచూచిన ప్రతివాడూ, అలాగే అనుకొనేవాడు. మరోలాగ అనుకొనే ఆస్కారం లేకపోయేది. దానికితోడై బాగా నారాయణ నొక్కినొక్కి తనకు వాటా వుందనడంతో ప్రజల్లో ఈ ఉద్దేశం బాగా నాటుకుంది. ఇదంతా ఊరి పెద్ద దొరగారు జగ్గయ్య బాబుదగ్గరికి పరుగుపెట్టింది. ఆయనదే తీరుపు కూరుపు.

ఇక ఊళ్లో పిట్టపిట్టకీ తెలిసిపోయింది నాయుడు నారాయణల మధ్య తగువు. రోళ్లు, రోకళ్ళు దగ్గరనుంచి వీధి కుక్కలదాకా ఆ సంగతే మొరుగుతున్నాయి.

నారయనాయుడు ఇంట్లో దినవారాలనుల్లే గడుపుకొంటున్నారు. "ఎంతఘోరం! ఇంట్లో నీడలో నిలబెట్టి పన్నీళ్లు జల్లానే? మనిషికి విశ్వాసముందా? మాయింటి కత్తు గడతాడా? మాయిల్లు దుంప నాశనం చేస్తాడా?" అని నారయ ఒకటే గోల.

ఇక నారాయణ కుటుంబమంతా దుమ్మెత్తి పోస్తోంది. "చాకిరీ అంతా చావదన్ని చేయించుకొని 'మొండిచెయ్యి చూపెడతాడా?" అని.

నాగులమ్మ ఈ విషయాన్ని బాగా సాగదీసేసింది. తప్పంతా వాళ్ళదేనని వాళ్లే మాత్రం వాటాదార్లు కారని, పాలికాపు వెధవలని, గుండెగుండె ఢీకించింది. జుట్టూజుట్టు రాపాడించింది.

ఈ ద్వేషం, అన్యోన్యమాత్సర్యం పిల్లల దాకా గూడా పాక్కుపోయింది. నారాయణ పెద్దకుర్రాడు! నారయ చిన్న పిల్లని దారిలో అడ్డగించి, బెదిరించాడట. ఈ విషయాన్ని ఆడవాళ్ళే బాగా సాగదీసుకున్నారు. పెద్ద రగడ తెచ్చిపెట్టారు. రావి చెట్టు గట్టుమీద నాప రాళ్లుపగిలిపోయాయి. కొమ్మలుకదిలిపోయాయి. నారయనాయుడు చాలా మానీభూతుడై పోయాడు. నమ్మి గాఢంగా మనసిచ్చి, ఆత్మీయుల్లో చేర్చుకొని మోసపోవడం, ఈనాటికి తెలిసొచ్చింది. కలలో అయినా యిలాంటి సంబంధం కలగవద్దని కల దేవుళ్ళందరినీ, పదే పదే మొక్కుకున్నాడు.

ఊళ్ళో జనం రెండు భాగాలకింద చీలి, ఒకళ్లు నారయినాయుడిని, మరొకళ్లు నారాయణని, సమర్థించి, వాళ్ల తరఫున మాట్లాడడం మొదలుపెట్టారు.

నారయ చెరుకు తోటలోకి మళ్ళింపబడ్డ పంటకాల్వ తిరిగి యథాస్థానంలోకి పోయింది. నారయ అదిమాచి నెత్తీ నోరు మొత్తుకున్నాడు. నారాయణ ఎన్ని చిక్కులు పెట్టగలడో అన్నీ పెట్టి చూపెడుతున్నాడు. ఒక రోజు గృహోన్ముఖమైన దూడల్ని, కుర్రాణ్ణి


# ఆంధ్ర బ్యాంకు లిమిటెడ్

(షెడ్యూల్డు బ్యాంకు)

స్థాపితము — 1923

హెడ్డాఫీసు :–మచిలీపట్టణము.

చెల్లింప బడిన మూలధనము, రిజర్వులు
రు. 35,00,000 పైబడినది.

అమలునందున్న వ్యాపారము
రు. 6,00,00,000 మించినది.

మద్రాసులో బ్రాంచీలు :

మైలాపూర్ ఆఫీసు : 49, కచ్చేరీ వీథి.

మద్రాసు బ్రాంచి : 378, ఎస్ప్లనేడ్.

త్యాగరాయ నగర్ ఆఫీసు :
81/82 పాండీ బజారు.

ఇతర బ్రాంచీలు, సబ్ ఆఫీసులు.

అనకాపల్లి, చీరాల, ఏలూరు, గుడివాడ గుంటూరు, కాకినాడ, మచిలీపట్నం, నరసరావుపేట, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తెనాలి, తుని, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, (సిటీ) అమలాపురం, అరండల్ పేట, (గుంటూరు), బాపట్ల, (గుంటూరుజిల్లా), భీమవరం, గవర్నరు పేట, (విజయవాడ), గూడూరు (నెల్లూరు జిల్లా), పాలకొల్లు.

ఆముదాలవలస (శ్రీకాకుళంజిల్లా), చల్లపల్లి, (కృష్ణాజిల్లా), దుగ్గిరాల, గొల్లప్రోలు, జగ్గయ్యపేట, మహారాణిపేట, (విశాఖపట్నం), పార్వతీపురం, పెడన (కృష్ణాజిల్లా) పెద్దాపురం, రామరావుపేట (కాకినాడ), సాలూరు, సామర్లకోట, తిలారు (శ్రీకాకుళం జిల్లా), తిరుపతి, వినుకొండ, కర్నూలు, నరసన్నపేట, ఇచ్ఛాపురం(శ్రీకాకుళంజిల్లా).

అన్ని విధములైన బ్యాంకింగు వ్యాపారములు, ఫారిన్ ఎక్స్చేంజి సహా కొనసాగింపబడును.

తాడేపల్లి శ్రీరాములు,
మేనేజింగ్ డైరక్టర్.

**ఇ. రామచంద్రమూర్తి,**
ఎమ్. ఏ. సి. ఏ. ఐ. ఐ. బి.,
జనరల్ మేనేజరు.

ఝడిపించి, బెదరగొట్టేసేడు. నానా అల్లరీ పెడుతున్నాడు. ఎవరేమన లేని క్రౌర్యం.

"ఏవన్నా అంటే నోరు ఊళ్లో పడ్డవేగాని, ఏం చేస్తున్నాడో చూడు" అంది నాగులమ్మ. న్యాయం తనవైపు చిక్కబెడదావని ఎవనే వాడు గాదు నారయ.

ఊళ్ళోవున్న నలుగురు పెద్దమనుషుల్ని పిలిపించి, జగ్గయ్యబాబుగారు, ఎవరికీ నష్టం కష్టం కలగకుండా, తీరుపు ఇచ్చారు.

"నారాయణ బాగుకోసమే నారయ అతన్ని చేరదీశాడు. అతనికి వాటా యిస్తానన్న మాట సూటిగా నిజం గాకపోయినా చూచాయగా నిజం! అయితే ఇంతనిమాత్రం గాదు! వీసమెత్తు పెట్టుబడి గూడా నారాయణ పెట్టలేదు. అంతా నారయ సొంత సొమ్ము. నారాయణ నానా మాటలూ అంటూ దుడుకుతనం ప్రయోగించి, ఒక వ్యక్తిని, చిక్కులు పెట్టడం సాకల్యంగా గర్హ్యం. అందులో నారాయణదే దోషి. వీళ్ళ మొన్న మొన్నటివరకూ వుండిన కుటుంబ సఖ్యత ఎంత ఆదర్శవంతమైనదో ఎంత దగ్గర అయిందో ఈ వూళ్ళో వున్నవాళ్లేవళ్ళకీ చెప్పనక్కరలేదు కాని, రోజులు మారి, వేరై ఇద్దరి మధ్య గ్రహస్థానం తప్పి, వైరుధ్యం ఏర్పడింది. ఇది కలియతీయవలసిన బాధ్యత గ్రామీణులది.

"ఇంతకూ పెట్టుబడి పెట్టుకున్న వారిదే లాభమంతా—అంటే అందులో పంపకం కోరడం మంచిది కాదని—కష్టపడి, ఏనుగుమల్లే భూములు దున్ని ఎక్కువగా నారాయణ పనిచేయలేదని ఎవరూ అనలేరు— దానికి ప్రతిఫలం కోరడం తప్పు కాదు. వ్యక్తిగత విషయాల్లోని ఎక్కువ తక్కువలు మనకక్కరలేదు.

"నారయ నాయుడు నారాయణకి పదిహేను బస్తాల ధాన్యం ఇవ్వవలసి వుంటుంది. సంవత్సరాంతం వరకూ, అతనిమీద నమ్మకం పెట్టుకొని, ఆధారం లేకండా ఇంతవరకూ నిశ్చింతగా వచ్చిన పెద్దమనిషిని పొమ్మంటామా? ఇప్పుడు పొమ్మంటే ఎక్కడికి పోతాడు బిచ్చమెత్తుకోడానికి? అతన్నేవిధంగా ద్రోహం చెయ్యగలడు నారయ? నమ్మకం ఇచ్చాడా లేదా? ఇచ్చినందుకు నారయ పదిహేను బస్తాలు, ఇవ్వవలసిందే! మాట పోగొట్టుకోడం మానవుల లక్షణం కాదు! అందులో మన గ్రామాల్లో మరీని. పట్టణాల్లోవుండే మురికి, మన పల్లెల్లోకింకా ప్రాకిరాలేదు. ఇంకా మనలో ధార్మికత్వం ఉంది. న్యాయం కళ్ళతో చూడగలం. ఆ న్యాయాన్ని చీల్చి, చెండాడే శక్తి మన ప్రజల్లో నిగూఢంగా వుందింకా. ఇప్పుడు మన తీర్పుకు దాటిపోయి నారాయణ నారయలు పట్టణాల్లో కోర్టులెక్కితే వాళ్ళకణుమాత్రం న్యాయం దొరకదు. దావాలో బోలెడు డబ్బు ఒడ్డాలి. అక్కడ అధర్మానికే న్యాయం జరిగిపోతుంది డబ్బువల్ల.

"ఇంతకూ నారాయణ, నారయలు ఈ తీర్పు అంగీకరించి, మళ్ళీ ఎప్పటిమల్లే ఉండడానికి ప్రయత్నించాలి. లేకపోతే వాళ్ళలో మానవత్వం చచ్చిందన్న మాట,

"నారయ పదిహేను బస్తాలు, నారాయణకియకపోతే నారయదే దోషం. ముమ్మూర్తులా నారయదే. ఇది కాదని కోర్టుకెక్కితే రెండు కుటుంబాలు సర్వనాశనమైపోతాయి. అదృష్టం గాలిలో దీపం-ఇది మా తీర్పు."

జగ్గయ్యగారి తీర్పు విషయం చాలా బాగుందన్నా, నారయనాయుడు, పదిహేనుబస్తాలు ఇవ్వననలేక పొయ్యాడు.

నాగులమ్మ నారయ ఇంటికి రావడంతోనే నోరు బద్దలు చేసుకుంది 'ఎవళ్ళకీ బుద్ధుల్లేవు' అని భయంకరంగా గర్జించింది. ఆమెకి ఆ తీర్పులో న్యాయం ఏకోశాన కనిపించలేదు. జగ్గయ్యగార్ని పెద్దమనుష్యుల్ని నోరార తిట్టింది.

నారాయణ పందెం గెలిచిన కోడిపుంజుమల్లే మెలికమీసం కొస త్రిప్పాడు.

నారయనాయుడు జరిగిపోయిన దానికంతకీ ఒక పెద్ద నిట్టూర్పు విడిచాడు.

కొందరు కొందరు తాము వెళ్లిన చోటికల్లా ఆనందాన్ని కలిగిస్తారు; మరి కొందరు తాము విడిచి వెళ్లిపోయిన చోటికల్లా ఆనందాన్ని కలిగిస్తారు.